సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం : 14 : జనవరి : 2024



విధుల్లోకి అంగన్‌వాడీలు

జిల్లాకేంద్రంలో 43 మంది అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరారు. సమ్మె నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. - IIలో



జ్యోతి స్వరూపుడే..!

బలగ అయ్యప్ప ఆలయంలో ఈ నెల 15న కర్పూర జ్యోతి వేడుకలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. - IIలో

బీఎడ్ రెండో సెమిస్టర్ మూల్యాంకనం పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం పూర్తయినట్లు ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

చెత్త సేకరణలో సబ్ కలెక్టర్



చెత్త తొలగిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్

టెక్కలి: మేజర్ పంచాయతీ టెక్కలిలో పరిసరాల పరిశుభ్రత దిశగా టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం పంచాయతీ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలిసి పట్టణంలో పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. స్వయంగా చెత్తను సేకరించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

కమనీయం..
గోదారంగనాథుల నిశ్చితార్థం



కవిటిలో గోదాదేవి సారెతో శోభాయాత్ర చేస్తున్న భక్తులు

కవిటి: ధనుర్మాస దీక్షలలో భాగంగా గోదాదేవి రంగనాథుల కల్యాణోత్సవ ఘట్టానికి ముందు రోజున శనివారం నిశ్చితార్థ మహోత్సవం కవిటి పట్టాభిరామ ఆలయంలో కనులపండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై కల్యాణోత్సవం ఏర్పాట్లలో భాగంగా గోదాదేవికి పట్టుపీతాంబరాలు, సారె, చీరలను పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగించారు. బంగారు కాసులు, వెండిమెట్టెలు సమకూర్చి పండ్లుఫలాల కావిడను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా చిన్నారులు గోదాదేవి వేషధారణలో తళుక్కున మెరిశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పాడిపంటల పండగ ఈ సారి మరింత శోభాయమానంగా భోగితో ప్రారంభమైంది. ఊరూరా.. ఎదఎదనా ఆహ్లాదం ఉప్పొంగుతోంది. వాతావరణం అనుకూలించి.. ప్రభుత్వం చేయూతనిచ్చి.. అన్నదాతతో పాటు అక్కచెల్లెమ్మలకు అన్ని విధాలా ఆనందదాయకమైన సంక్రాంతి పండగకు భోగభాగ్యాల భోగి స్వాగతం పలుకుతోంది. పల్లెల్లో పెద్ద పండగ సంతోషం పొంగిపొర్లుతోంది. సిక్కోలు యువతులు ఇలా భోగి పండగను ఆహ్వానించారు. -సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం

● భోగి మంటలకు దూరం



భోగి పండగను జరుపుకోని గాజులకొల్లివలస గ్రామం



కొత్తూరు మండలం ఓంద్రుజోల గ్రామం

నరసన్నపేట/ఆమదాలవలస రూరల్/కొత్తూరు: భోగభాగ్యాల భోగి పండగ అంటే చిన్న పిల్లలు నుంచి పెద్దల వరకూ అందరికీ సరదానే. గ్రామస్తులంతా ఒకచోటకు చేరి పెద్ద మంట వేసుకుని చలికాగుతూ సందడి చేస్తుంటారు. సంక్రాంతి ముందు రోజు అన్నిచోట్లా జరిగే ఈ భోగి మంట కొన్ని గ్రామాల్లో మాత్రం కనిపించదు. తమ పూర్వీకుల నుంచి సంప్రదాయం కొనసాగుతోందని, అందుకే తాము భోగి మంటలు వేయడం లేదని చెబుతున్నారు. ఒకవేళ ఎవరైనా భోగి మంట వేస్తే ఊరికి అరిష్టమని నమ్ముతున్నారు. అందుకే పెద్దల బాటనే అనుసరిస్తున్నారు. నరసన్నపేట మండలం చోడవరం, చింతువానిపేట, బసివలస, గోకయ్యవలస, జలుమూరు మండలం లింగాలవలస, సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర, గార మండలం బూరవిల్లి, ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలస, కొత్తూరు మండలం ఓంద్రుజోల తదితర గ్రామాలు భోగి పండగకు దూరంగా ఉంటున్నాయి.

● ఒక రోజు ముందుగానే..



కవిటి మండలం చండిపుట్టుగలో భోగిమంటలు



ఇచ్ఛాపురం పట్టణం బెల్లుపడలో..



కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామంలో..

కవిటి/ఇచ్ఛాపురం/కొత్తూరు: కొన్ని గ్రామాల్లో ఒక రోజు ముందుగానే భోగి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కవిటి మండలం చండిపుట్టుగలో శనివారం సాయంత్రం దైవాన్ని స్మరించి భోగిమంటను వెలిగించారు. మూడురోజుల పాటు గ్రామంలో భోగి మంటల వెలిగించడం సంప్రదాయమని గ్రామ పెద్దలు వివరించారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని బెల్లుపడ, కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామాల్లోనూ శనివారం సాయంత్రమే భోగి మంటలు వెలిగించారు.



ప్రయాణికులతో నిండిన ఆమదాలవలస రైల్వేస్టేషన్

● రద్దీగా రైల్వేస్టేషన్..

వలస కార్మికులు, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారంతా సంక్రాంతి పండగ కోసం స్వగ్రామాలకు పయనం కావడంతో శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ శనివారం కిక్కిరిసిపోయింది. స్టేషన్‌లో దిగాక ఆటోలు, బస్సుల కోసం పరుగులు తీస్తూ సొంతగ్రామాలకు పయనమవుతున్నారు. కుటుంబ సభ్యులను, స్నేహితులను కలుసుకునేందుకు ఉత్సాహంతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. -ఆమదాలవలస

● మార్కెట్ కిటకిట..



పలాస–కాశీబుగ్గ మార్కెట్ జనంతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి పండగ సందర్భంగా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో కిటకిటలాడింది. పూజా సామగ్రితో పాటు కలగూర విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. -కాశీబుగ్గ

● నేడు అరసవల్లిలో..

రాష్ట్ర దేవదాయ శాఖ ఆదేశాల మేరకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద మకర సంక్రాంతి సంబరాలు ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమవుతాయని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. భోగి పండుగ సందర్భంగా ఆలయం ముందు భోగి మంట, మకర సంక్రాంతికి ఆదిత్యుని మూలవిరాట్టుకు క్షీరాభిషేకం, ముగ్గుల పోటీలు, కనుమ పండుగ నాడు గోపూజ, కోలాటం నిర్వహిస్తామన్నారు. -అరసవల్లి

● పొట్టేళ్లకు గిరాకీ..



ఆమదాలవలస పట్టణ పరిధిలోని చింతాడ వారపు సంత శనివారం కిటకిటలాడింది. కనుమ రోజు మాంసం కోసం ఉపయోగించే ఈ పొట్టేళ్ల ధరలు ఆకాశాన్నంటాయి. 10 కిలోల బరువైన పొట్టేలు రూ.10 వేలు నుంచి రూ.12 వేలు వరకు ధర పలికింది. - ఆమదాలవలస రూరల్



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రాయల్ డ్యాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

● స్వర్ణక్రాంతి

సంక్రాంతి సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన సూక్ష్మచిత్ర కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి 22 క్యారెట్ల బంగారంతో బుల్లి గాలిపటం తయారు చేశారు. 20 మిల్లీ గ్రాముల బంగారం వినియోగించి రెండు గంటలు శ్రమించి 0.03 మి.మీ.ఎత్తు, 0.05 మి.మీ. వెడల్పుతో దీనిని తయారు చేసినట్లు తెలిపారు. -కాశీబుగ్గ



ఆడరా బసవా..

- గంగిరెద్దులకు పెట్టింది పేరు భైరిసారంగపురం
- బసవన్నలకు ప్రత్యేక శిక్షణ



ఇతర రాష్ట్రాల్లో ప్రదర్శనలిస్తున్న గంగిరెద్దుల కులస్తులు



ముంగిళ్ల బసవన్న మురిసే ఆడేవేళ..

మందస: బసవన్నలు రంకెలేస్తేనే ఊరికి పండగ వచ్చినట్టు. ఆ సన్నాయి రాగం వినిపిస్తేనే వీధికి కళ వచ్చినట్టు. మరుగున పడిపోతున్న జానపదాలకు మళ్లీ గుర్తింపు తెచ్చేలా గంగిరెద్దులను ఆడిస్తూ మందస మండలంలోని భైరిసారంగపురం వాసులు ఆ కళను కాపాడుతున్నారు. దాదాపు 60 ఏళ్ల కిందట ఈ కుటుంబాలు సింహాచలం, అడవివరం ప్రాంతాల నుంచి వలస వచ్చాయి. అప్పటి నుంచి గంగిరెద్దుల అలంకరణ, ఆటపాటలతో జీవనం గడుపుతున్నాయి. ఈ తరానికి చెందిన వారు మాత్రం అక్షరాస్యులై ఉద్యోగాలు చేస్తున్నారు. గ్రామాల్లో భక్తులు సింహాద్రి అప్పన్నను మొక్కుకుని తమ పశువుల శాలలో పుట్టిన దూడలను గానీ కొనుగోలు చేసి గానీ వీరికి అందజేస్తారు. వీటిని బాగా మచ్చిక చేసుకుని, ఎంతో శ్రమించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తాము చెప్పినట్లు చేసేలా తర్ఫీదునిస్తారు. తౌడు, ఉలవలు, నువ్వులు, తెలకపిండి, పెసర, మినుముపొట్టు తదితర వాటితో దాణా



సంక్రాంతికి కులవృత్తి చేస్తున్న గంగిరెద్దుల కులస్తులు

ఇచ్చి, ముందుగా ఒక సంవత్సరం పాటు ప్రతి రోజూ శిక్షణ ఇస్తారు. ఈ ఎద్దులను సంక్రాంతి మూడు రోజుల పాటు తమ కులానికి ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం సన్నాయి, డోలు, గంగిరెద్దులను చక్కగా అలంకరించి, గ్రామాల్లో పర్యటించి, ఇంటింటికీ తిరుగుతారు. గ్రామీణులు ఇచ్చే కానుకలను స్వీకరిస్తారు. సంక్రాంతికి సొంత ఇళ్లకు చేరుకునే ప్రజలు ఈ విన్యాసాలను ఎంతో ఆసక్తితో తిలకిస్తారు. వారికి ధాన్యం, బియ్యం, డబ్బును అందిస్తారు. మరణించిన తమ పెద్దల ఆత్మలకు శాంతి కలగాలని 'భత్యం' అందిస్తే గంగిరెద్దుల కులస్తులు పెద్దల పేరున పొగుడుతారు. ప్రస్తుతం ఈ కళ దాదాపుగా అంతరించిపోతోంది. జిల్లాలో భైరిసారంగపురం, చింతాడ, చిన్నదూగాం, పెంటిభద్ర, జగన్నాథపురం, గుండుబెల్లిపేట, కొన్నానపేట తదితర గ్రామాల్లో ఎక్కువగా ఈ కులస్తులు న్నారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి గంగిరెద్దులతో గ్రామాల్లో తిరిగే వీరంతా ముఠాకు వెళ్లి గంధం అమవాస్య(ఏప్రిల్) సింహాద్రి అప్పన్న ఉత్సవాలకు తిరిగి వస్తారు. నాలుగు నెలల పాటు కుటుంబానికి దూరంగా ఉంటూ జీవనం సాగిస్తారు. కార్తీక మాసంలో ఉపమాక, సింహాచలం ఏడు రోజుల యాత్రతో పాటు సింహాద్రి అప్పన్న దర్శనం చేస్తారు.

ఆదరణ తగ్గుతోంది



గంగిరెద్దుల కళకు ఆదరణ తగ్గుతోంది. ఏడాది ఆరు నెలలు ఎద్దులకు శిక్షణ ఇస్తాం. ఆరు నెలలు ముఠా(గంగిరెద్దులతో యాచన)కు వెళ్తాం. ఇదే మాకు కులవృత్తి. అప్పటిలో సుమారు 120 కుటుంబాలు ఇదే వృత్తితో జీవించేవారం. నేడు 30 కుటుంబాలు మాత్రమే ఈ కళను కొనసాగిస్తున్నాయి. గంగిరెద్దుల కళకు ప్రోత్సాహం కరువవ్వడంతో కూలికి వెళ్తున్నాం. సంక్రాంతికి ఒడిశా వాసులు గంగిరెద్దుల నృత్యాలను ఎక్కువగా ఆదరిస్తారు. అంతేకాదు.. కళాకారులను గౌరవించి, భత్యాన్ని కూడా ఎక్కువగా ఇస్తారు. – బాడ సూరన్న, జానపద కళాకారుడు, భైరిసారంగపురం

క్లుప్తంగా

ఆమె నేత్రాలు సజీవం


కామేశ్వరమ్మ(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో నివాసముంటున్న ఇప్పిలి కామేశ్వరమ్మ (85) మృతి చెందారు. ఆమె మరణానంతరం కూడా మరో ఇద్దరికి చూపు నివ్వాలనే ఆలోచనతో కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి శనివారం విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందించారు. నేత్రదాత కుటుంబ సభ్యులను చైర్మన్ అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకుంటే 7842699321 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


ఈవోకు చెక్ అందజేస్తున్న దాత

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కోసం పీఎన్ కాలనీకి చెందిన జవ్వాది రమాజయశ్రీ తన తల్లి తోటకూర మీనాక్షి జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు కుమార్తెలు శ్రీజ, శ్రీహలతో కలిసి శనివారం ఈవో వి.హరిసూర్యప్రకాష్‌కు చెక్ అందించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల విజేత టి-గంగువాడ


విజేతలకు నగదు, ట్రోఫీ అందిస్తున్న వసంతరావు, గ్రామపెద్దలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో బత్సల కుమారస్వామి జ్ఞాపకార్థం కుమార్‌ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ క్విజ్ పోటీల్లో టి.గంగువాడ విజేతగా నిలిచింది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి 35 జట్లు పాల్గొనగా వారందరికీ తొలుత స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి 10 జట్లును ఎంపిక చేసి పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన టి.గంగువాడ జట్టుకు రూ.11వేలు నగదు, ట్రోఫీని స్థానిక సర్పంచ్ గొరకల వసంతరావు అందించారు. తర్వాత స్థానాల్లో నెల్లిమర్ల, రట్టి, లండారిపుట్టుగ జట్లు నిలిచాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ , గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు కె.గోపాల్, గర్తం దానేసు, పుచ్చ అజిత్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

పలాసపురం యువకుడి ప్రతిభ


తల్లి శ్రీదేవితో పవన్

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామానికి చెందిన బాబూరావు, శ్రీదేవిల కుమారుడు ఎన్.పవన్ యూపీఎస్సీ కంబైన్డ్ జియో సైటింస్ట్ విభాగంలో జాతీయస్థాయిలో 65వ ర్యాంకు సాధించి జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో మైన్స్ విభాగంలో జూనియర్ జియాలజిస్ట్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

620 నివాసాలు.. 103 మంది పోలీసులు

- బలగ హడ్కోకాలనీలో కార్డెన్ సెర్చ్


సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : ట్రైనీ డీఎస్పీ, ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్‌ఐలతో సహా 103 మంది పోలీసు సిబ్బందితో శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా బలగ హడ్కో కాలనీలో 620 నివాస గృహాల్లో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటలకు 11 బృందాలుగా ఏర్పడి ఇంటింటా వివరాలు ఆరా తీసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పప్పల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎవరైనా అనుమానితంగా తారసపడితే పోలీసులకు తప్పక సమాచారమందించాలని ప్రజలకు సూచించారు. పండక్కి ఊర్లేళ్లేవారు ఎక్కువ రోజులు ఉంటే కచ్చితంగా పోలీసులకు తెలియజేయాలని, ఇంటి వద్ద పోలీసు నిఘా పెడతామన్నారు. అనంతరం 497 ద్విచక్రవాహనాలు, ఏడు కారులు, నాలుగు ఆటోల ధ్రువపత్రాలు పరిశీలించి రికార్డులు లేని పది వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ చప్పిడి రాజా, శ్రీకాకుళం రూరల్ సీఐ లెంక సన్యాసినాయుడు, రెండో పట్టణ ఎస్‌ఐలు నాగిరెడ్డి లక్ష్మణరావు, కె.లక్ష్మి, ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్, గార ఎస్‌ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి స్వరూపుడే..!


బలగ అయ్యప్ప ఆలయం వద్ద భక్తుల రద్దీ(ఫైల్)


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని బలగలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం నిత్యపూజలు, ఉత్సవాలతో భక్తుల పాలిట వైకుంఠధామంగా అలరారుతోంది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఈ ఆలయంలో కేరళ రాష్ట్రం శబరిమలై తరహాలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా మకర సంక్రాంతి నాడు శబరిమలలో మకరజ్యోతి దర్శనం ప్రత్యేకం కాగా ఇక్కడ కర్పూర జ్యోతి దర్శనం అదేస్థాయిలో ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

- 15న బలగ అయ్యప్ప ఆలయంలో కర్పూర జ్యోతి వేడుకలు
- స్వామికి ప్రత్యేక అలంకరణలు
- శరణుఘోషతో ఊరేగింపు


శ్రీకాకుళం కల్చరల్:

బలగ అయ్యప్పస్వామి ఆలయం ఆధ్యాత్మికతకు నెలవుగా మారింది. 1978లో శ్రీకాకుళం నుంచి ఉమాదీక్షిత్, ప్రేమిజీ ఆధ్వర్యంలో అయ్యప్ప వ్రతాలు, శబరిమల యాత్ర ప్రారంభమైంది. నాటినుంచి ప్రతి ఏడాది భక్తుల సంఖ్య రెట్టింపవుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆలయాన్ని నిర్మించారు. 26 ఏళ్లుగా అయ్యప్పస్వామి శబరిమలలో మకరజ్యోతి దర్శనం రోజున అంటే సంక్రాంతి పర్వదినాన ఇక్కడి ఆలయంలోనూ కర్పూర జ్యోతి దర్శనాలకు కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పట్టు వస్త్రాల సమర్పణ, మణిమయ మకుత ఆభరణ అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం ఉంటుంది. సాయంత్రం దివ్య మకర జ్యోతి దర్శన సమయంలో అయ్యప్పస్వామికి కర్పూర జ్యోతి దర్శనం ఉంటుంది.

పక్కాగా ఏర్పాట్లు..

ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మంగళవాయిద్యాలు, బాణసంచా వినోదాలతో, ఏకాదశ ఛత్ర సేవతో అయ్యప్పస్వామిని ఊరేగించేలా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. భక్తులందరికీ ఉచితంగా కర్పూరం పంపిణీ చేస్తారు. అనంతరం కర్పూర జ్యోతిలో వేస్తారు. వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.


కర్పూర జ్యోతి దర్శనం (ఫైల్)



ఏర్పాట్లు పూర్తి

సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని శబరిమలలో మకర జ్యోతి దర్శనం సమయంలో ఇక్కడికి వచ్చే భక్తుల కోసం దివ్యమైన కర్పూర జ్యోతి దర్శనం ఏర్పాటు చేశాం. ఇప్పటికి 26 ఏళ్లుగా ఉత్సవం నిర్వహిస్తున్నాం.

– దేవరకొండ శంకరనారాయణ,అర్చకులు

విధుల్లోకి అంగన్‌వాడీలు


రామప్పడుదిబ్బ పాతపోస్టాఫీసు వద్ద విధుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు


శ్రీకాకుళ ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద డిక్లరేషన్ పత్రాలతో అంగన్‌వాడీలు

- జిల్లాకేంద్రంలో లీడర్లతో సహా 43మంది సిబ్బంది చేరిక
- సమ్మె నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంగా యూనియన్ లీడర్లు ముగ్గురితో సహా 43 మంది అంగన్‌వాడీ సిబ్బంది (కార్యకర్తలు-22 మంది, ఆయాలు-21 మంది) శనివారం విధుల్లో చేరినట్లు శ్రీకాకుళం అర్బన్ ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి పేర్కొన్నారు. వీరంతా ప్రభుత్వం నుంచి షోకాజ్ నోటీసులు అందుకున్నవారేనని తెలిపారు. అర్బన్ పరిధిలో ఉన్న 176 సెంటర్లకు గాను 111 మంది కార్యకర్తలు, 112 మంది ఆయాలతో కలిపి 223 మంది విధుల్లో చేరారని, ఇంకా 67 మంది చేరాల్సి ఉందని, ఇప్పటికైనా పట్టువీడాలని సూచించారు. యూనియన్ లీడర్లయిన అంగన్‌వాడీ వర్కర్లు రాజేశ్వరి, ప్రమీల, హెల్పర్ పద్మావతిలతో సహా మిగిలిన సిబ్బంది శనివారం వరం స్ట్రీట్ సమీపంలో ఉన్న ఐసీడీఎస్ పీవో కార్యాలయానికి వెళ్లి సమ్మె నుంచి తప్పుకుంటున్నట్లు, విధులకు ఎటువంటి అంతరాయాన్ని కలిగించమంటూ.. ఇక ఎటువంటి సమ్మెల్లో పాల్గొనమంటూ డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేసి అందజేశారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగన్ పాలన


మాట్లాడుతున్న అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమాజంలో సమానత్వం కోసం పోరాడిన యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన బాటలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేబినెట్‌లో 68 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించారని, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి డీబీటీ ద్వారా రూ.2.68లక్షల కోట్లు అందించారని వివరించారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ చట్టసభల్లో, స్థానిక సంస్థల పదవుల్లో, నామినేషన్లపై ఇచ్చే పనుల్లో ఆయా వర్గాలకు 50 శాతం కేటాయించాలని నిర్దేశించారన్నారు. రాష్ట్రంలో 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 56 మంది చైర్మన్లు, 672 డైరెక్టర్లను నియమించిన గొప్ప మానవతావాది జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో జరగనున్న అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్నాల శ్రీనివాసరావు (కోణార్క్ శ్రీను), సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్త, చంద్ర భూషణ్ గుప్తా, గుడ్ల దామోదర్, కళింగ కోమటి సంఘ జిల్లా అధ్యక్షులు తంగుడు జోగారావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు బరాటం సంతోష్, ఎ.వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు

శ్రీకాకుళం క్రైమ్ : సంక్రాంతి సందర్భంగా మద్యం అమ్మకాలు నిబంధనల మేరకే జరగాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పనివేళలు సక్రమంగా పాటించాలని, బెల్టు షాపులకు మద్యం సరఫరా జరగకుండా చూడాలని, జనం రద్దీ ఉన్న చోట స్థానిక పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి: మండలంలోని నువాగడ పంచాయతీ కొలాపానీ గ్రామానికి చెందిన సవర మహాలక్ష్మీ నుంచి రెండు సిమెంటు కవర్లలో 250 ప్యాకెట్లు, సవర దుర్లభో నుంచి రెండు సిమెంటు కవర్లలో 300 ప్యాకెట్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్.బాలరాజు శనివారం తెలిపారు. వీరిద్దరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వంద మద్యం బాటిళ్లు పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని అరసవిల్లి మిల్లు జంక్షన్ వద్ద వంద మద్యం బాటిళ్లు (180 ఎంఎల్)తో ఓ వ్యక్తి శనివారం రాత్రి పట్టుబడినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు గ్రామానికి చెందిన పంచిరెడ్డి ధనుంజయ అరసవిల్లి మిల్లు జంక్షన్ సమీపంలో ఉన్న దుకాణం వద్ద బాటిళ్లు కొని సంచిలో వేసి అక్కడికి కొద్ది దూరంలో నిల్చొని ఉండగా పోలీసులు పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

గడ్డివాము దగ్ధం

పాతపట్నం: మేజర్ పంచయతీ పాతపట్నం పరిధిలోని అచ్యుతాపురంలో ఇద్దరు పాడి రైతులకు చెందిన నాలుగు ఎకరాల గడ్డివాము శనివారం దగ్ధమైంది. గ్రామ శివారున ఉన్న బిశెట్టి జోగారావు, ఎర్రంకి శ్రీరాములుకు చెందిన గడ్డి వాములకు ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో ఈ ఘటన జరిగింది. టెక్కలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో రూ.45 వేలు విలువైన గడ్డి కాలిపోయిందని పాడి రైతులు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి


మంత్రి ధర్మాన ప్రసాదరావును సన్మానిస్తున్న ఎస్సీసెల్ నాయకులు

శ్రీకాకుళం రూరల్: ఈ నెల 19న విజయవాడలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరగనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొన్నాడ రుషి అధ్యక్షతన ఎస్సీ సెల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో గొప్ప మేధావికి జరిగే గౌరవ వందనం ఈ కార్యక్రమమని చెప్పారు. ఈ ప్రభుత్వంలో 125 అడుగుల విగ్రహం నిర్మాణం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంగోపాల్, జి.అనిత, ముంజేటి కృష్ణమూర్తినాయుడు, యజ్జల గురుమూర్తి, కానుకుర్తి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం అద్భుతం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్ పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో చంద్రమహల్ ఎదురుగా జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి ఆధ్వర్యంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లా నుంచి హాజరయ్యేందుకు ప్రతినిధులు బృందానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, సుడా చైర్మన్ కోరాడ ఆశాలతా గుప్తా, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు రొతు శంకరరావు, పార్టీ నేతలు శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయరావు, రాజాపు అప్పన్న, కోరాడ చంద్రభూషణ్ గుప్తా, రొతు శంకరరావు, తంగుడు జోగారావు, బార్ల వేణు, గుడ్ల దాము, తంగుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెట్ల ప్రతిభ


మాస్టర్స్ అథ్లెట్లతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్స్ క్రీడామైదానం వేదికగా ఈ నెల 9,10 తేదీల్లో జరిగిన 41వ ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా మాస్టర్ అథ్లెట్స్ 53 పతకాలతో సత్తాచాటారు. వీరిని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి శనివారం అభినందించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎండీ కాసీం ఖాన్, ప్రధాన కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ టీం చాంపియన్‌గా కేరళ

- విజేతలకు బహుమతులు అందించిన మంత్రి అప్పలరాజు


విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ : పలాసలో నిర్వహించిన 47వ సీనియర్ జాతీయ టెన్నీకాయిట్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. టీం చాంపియన్‌గా కేరళ, డబుల్స్ విన్నర్‌గా తమిళనాడు, మిక్సిడ్ డబుల్స్ విన్నర్‌గా తమిళనాడు, రన్నర్‌గా ఆంధ్రప్రదేశ్, ఇండివిజ్యువల్ సింగిల్ విన్నర్‌గా కేరళ, రన్నర్‌గా తమిళనాడు జట్లు నిలిచాయి. రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాస్ఫూర్తితో ఆడిన జట్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలాసలో జాతీయస్థాయి పోటీలు జరగడం ఆనందంగా ఉందని, ఇక్కడ రూ.5 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పి.వి.సతీష్‌కుమార్, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, అధికార ప్రతినిధి గుజ్జు జోగారావు, నిర్వాహకులు పట్ట తవిటయ్య, వార్డు ఇన్‌చార్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..!


రాజపురంలో 1995-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు


కేవీఎన్‌జీహెచ్ ఉన్నత పాఠశాలలో 48 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు


32 ఏళ్లు తర్వాత కలిసిన పాతటెక్కలి హైస్కూల్ పూర్వ విద్యార్థులు


సింగుపురం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కవిటి/ జలుమూరు/ వజ్రపుకొత్తూరు/ కాశీబుగ్గ/శ్రీకాకుళం రూరల్: : ఎక్కడోపుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము చదువులమ్మ చెట్టునీడలో.. అంటూ తమ బాల్యంలో గడిపిన క్షణాలు నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు 1995-2000 బ్యాచ్ రాజపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు. శని వారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అపూర్వ సమ్మేళనంలో భాగంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి ఉపాధ్యాయులకు పాదపూజ చేసి దుశ్శాలువలు, జ్ఞాపికల్ని అందించి ఘనంగా సత్కరించారు. తమ అనుభవాల్ని గురువులతో పంచుకున్నారు. జలుమూరు కేవీఎన్‌జీహెచ్ ఉన్నత పాఠశాల 1975-76 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు కూడా శనివారం పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సత్కరించారు. వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఒకేచోట చేరారు. తాము చదివిన బడికి మేలు చేయాలనే ఉద్దేశంతో సైకిల్‌స్టాండ్‌ను నిర్మించారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1985-90 మధ్య చదువుకున్న 110 మంది పూర్వ విద్యార్థులు శనివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకుని సందడి చేశారు.